www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 20 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-129 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## నేడు మునుగోడుకు పిసిసి చీఫ్ రేవంత్

- ఐదు మండలాల్లో పాదయాత్రకు ప్లాన్
- 175 గ్రామాల్లో కాంగ్రెస్ నేతల యాత్రలు
- ఊరూరా రాజీవ్ జయంతి ఉత్సవాల నిర్వహణ
- కెసిఆర్ సభ రోజే బలిమి చాటాలని కాంగ్రెస్ నిర్ణయం



**నల్లగొండ, ఆగస్టు 19 (సమ సమాజం):** కరోనా నుంచి కోలుకున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మునుగోడుపై దృష్టి పెట్టారు. అక్కడ ప్రచారరంగంలోకి దూసుకుని పోయేందుకు ప్లాన్ రెడీ చేస్తున్నారు. ఇందులో భాగంగా మునుగోడులో శనివారం రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేపట్టనున్నారు. ఒకే రోజు ఐదు మండలాల్లో పాదయాత్ర కు రేవంత్ ప్లాన్ చేశారు. అదే రోజున మునుగోడు నియోజకవర్గంలోని 175 గ్రామాల్లో కాంగ్రెస్ నేతల పాదయాత్రలు కూడా జరగనున్నాయి. ఈ నెల 21 నుంచి మండలాల వారీగా రేవంత్ పర్యటించ నున్నారు. మునుగోడులో ఈ నెల 20న సీఎం కేసీఆర్ సభ ఉండగా, అదే రోజు రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా 175 మంది కాంగ్రెస్ దిగ్గజాలు నియోజకవర్గానికి రానున్నారు. సీనియర్ నేతలు జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క,సీనియర్ నేతలు షబ్బీర్ అలీ వంటి నేతలు ఒక్కో గ్రామానికి ఒకరు చొప్పున చేరుకుని కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈనెల 20న రాజీవ్‌గాంధీ జయంతిని సందర్భంగా మునుగోడు నియోజకవర్గంలోని 175 గ్రామాల్లో పార్టీల నేతలు కార్యక్రమాలు చేపట్టాలని కార్యచరణ రూపొందించామన్నారు. గ్రామంలో కనీసం 100 కుటుంబాలను కలిసేలా ప్రణాళిక

3

## నేడు మునుగోడులో సిఎం కెసిఆర్ సభ

- భారీగా ఏర్పాట్లు చేసిన టిఆర్ఎస్ నేతలు
- సవ్యంగా పర్యవేక్షిస్తున్న మంత్రి జగదీశ్ రెడ్డి
- భారీగా జనం తరలించేలా ప్రత్యేక ఏర్పట్లు



**నల్లగొండ, ఆగస్టు 19 (సమ సమాజం):** మునుగోడు ప్రజాదీవెన సభ ద్వారా సిఎం కెసిఆర్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. మునుగోడులో గెలవాల్సిన ఆవశ్యకతను వివరిస్తారు.అలాగే నల్లగొండ జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలతో పాటు బిజెపి,కాంగ్రెస్‌లను ఎండగట్టేలా కెసిఆర్ ప్రసంగం ఉండబోతున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకానున్న సభకు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లన్నీ పూర్తి చేసారు. మునుగోడులోని చౌటుప్పల్ రోడ్డులో బహిరంగ సభ కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేసారు. నాలుగు రోజులుగా మంత్రి జగదీశ్‌రెడ్డి స్వయంగా సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు నేతృత్వంలో పలు బృందాలు సభ ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యాయి. సభాస్థలాన్ని సిద్ధం చేయడంతోపాటు వేదిక నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. ఇక సీఎం కేసీఆర్ సభకు రోడ్డు మార్గంలో రానున్నట్లు తెలిసింది. హైదరాబాద్ నుంచి బయల్దేరి చౌటుప్పల్, నారాయణపురం మీదుగా మునుగోడు చేరుకోనున్నట్లు సమాచారం. దీంతో సీఎం కేసీఆర్

3

## మునుగోడులో సభల సందడి

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు

నేడు సిఎం సభతో పాటు కాంగ్రెస్ యాత్రలు

రేపు అమిత్ షా బహిరంగ సభకు సన్నాహాలు



**నల్లగొండ, ఆగస్టు 19 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నిక తేదీ ఖరారుకాకున్నా బహిరంగ సభల సందడి ఊపందుకుంది. ప్రధాన పార్టీల నేతలు ఇప్పటికే నియోజకవర్గమంతా చుట్టి వస్తున్నారు. సాధారణ ఎన్నికలకు ముందు వస్తున్న మునుగోడు ఉప ఎన్నికను ప్రధాన పార్టీలు సెమీఫైనల్‌గా భావిస్తున్నాయి. ఎన్నిక నోటిఫికేషన్ వెలువడిన తర్వాతే సందడి చేయాలని అధికార టీఆర్ఎస్ తొలుత నిర్ణయించినా, ఆ తర్వాత పునరాలోచనలో పడింది. బీజేపీ వ్యూహాలకు చెక్‌పెట్టే క్రమంలో ఈనెల 21న అమిత్‌షా సభ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు 20న

3

## మునుగోడులో ఐదుసార్లు సిపిఐ విజయం

లెఫ్ట్ మద్దతుకోసం టిఆర్ఎస్, కాంగ్రెస్ యత్నం



**నల్లగొండ, ఆగస్టు 19 (సమ సమాజం):** మునుగోడు నియోజకవర్గం ఏర్పడిన నాటినుంచి 12సార్లు ఎన్నికలు జరగ్గా ఐదుసార్లు సీపీఐ అభ్యర్థులు విజయం సాధించారు. ఉప ఎన్నిక నేపథ్యంలో మునుగోడు నియోజకవర్గానికి చెందిన సీపీఎం కీలక నేతలతో ఈ నెల 10న ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం భేటీ అయ్యారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో టీఆర్ఎస్‌కు విజయావకాశాలున్నాయని సీపీఎం నేతలు అంచనా వేసినట్టు సమాచారం. నియోజకవర్గంలో సీపీఎంకు సుమారు 9వేల ఓట్లు, సీపీఐకి సుమారు 13వేల ఓట్లు ఉంటాయని ప్రాథమికంగా గుర్తించారు. సీపీఎంకు ఐదుగురు సర్పంచ్‌లు, ఏడుగురు ఎంపీటీసీలు, నలుగురు కౌన్సిలర్లు ఉండగా, సీపీఐకి 12 మంది వరకు సర్పంచ్‌లు, 15 మంది వరకు ఎంపీటీసీలు ఉన్నట్లు సమాచారం. సీపీఐ, సీపీఎం కలిసే ఈ ఎన్నికల్లో దిగాలనే సూత్రప్రాయంగా ఓ అభిప్రాయానికి వచ్చారు. సీపీఐ, సీపీఎం కలిసి పోటీచే యాలని, ఎన్నిక నాటికి ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చి బీజేపీ బలం పుంజుకుంటే ఆ పార్టీని ఓడించే శక్తి దేనికి ఉంటుందో వాటికి మద్దతు తెలపాలని సీపీఎం నేతలు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లికంటి సత్యం పోటీకి ఆసక్తిగా ఉన్నట్లు పార్టీ శ్రేణులు తెలిపాయి. సీపీఐ, సీపీఎం మద్దతు కోసం టీఆర్ఎస్ నుంచి హరీష్‌రావు ఇప్పటికే ఒక ప్రతిపాదన చేయగా, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సైతం మద్దతివ్వాలని ఇరుపార్టీల నేతలను కోరారు.

## ఏనిమిదేండ్లలో తెలంగాణ అద్భుతమైన ప్రగతి

మూడు అంశాలతో ముందుకు వెలుతున్నాం

ప్రపంచం భారత్‌వైపు చూస్తుంటే..

అంతా తెలంగాణవైపు చూస్తున్నారు

డిప్లొమాటిక్ ఔట్‌రిచ్ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్టు 19 (సమ సమాజం):** ఏనిమిదేండ్లలో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధించిందని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం రెట్టింపు అయిందని చెప్పారు. 2014లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.5.6 లక్షల కోట్లుగా ఉండేదని, 2022 నాటికి అది రూ.11.55 లక్షల కోట్లకు చేరిందన్నారు. ప్రధానితో జరిగిన సమావేశంలో ఇదేవిషయం చెప్పానని వెల్లడించారు. హైదరాబాద్ రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఉన్న టీ-హబ్‌లో జరిగిన డిప్లొమాటిక్ ఔట్‌రిచ్ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం 'త్రీఐ' మంత్రతో శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలో యంగెస్ట్ రాష్ట్రమైన తెలంగాణ.. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. ఇవాళ తెలంగాణ అన్నిరంగాల్లో ముందంజలో

3

## నగరంలో పేలు ఆలయాల్లో శ్రీకృష్ణాష్టమి సందడి

ఇస్కాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

శుభాకాంక్షలు తెలిపిన మంత్రి హరీష్ రావు





**హైదరాబాద్, ఆగస్టు 19 (సమ సమాజం):** రాష్ట్ర ప్రజలకు మంత్రి హరీశ్ రావు సహా పలువురు మంత్రులు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణ భగవానుడు అవతరించిన పర్వదినం శ్రీ కృష్ణాష్టమి అని చెప్పారు. అందరి జీవితాల్లో అడ్డంకులు తొలగించి సుఖ సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఈమేరకు మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా మొదలయ్యాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు క్యూకట్టారు. బంజారాహిల్స్ ఇస్కాన్ గోల్డెన్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ నామస్మరణతో ఇస్కాన్ ఆలయాలు మార్మోగాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైష్ణవ ఆలయాల్లో కూడా కృష్ణాష్టమి వేడుకలు గనంగా నిర్వహించారు. అల్లరి కృష్ణుడు పుట్టినరోజు పిల్లలకూ పెద్ద పండుగే. బాలకృష్ణుడు చేసిన అల్లరి ఈ పిల్లలకు తెలియచేస్తూ పలుచోట్ల గోకులాష్టమి నిర్వహించారు. జన్మాష్టమిని పిల్లలతో సెలబ్రేట్ చేయడం ద్వారా పిల్లలకు కృష్ణుడి కథలు తెలియచేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. కృష్ణుడు, గోపికలు ఎలా ఉంటారో చెప్పి అలాంటి వేషాలు వేయించి సందడి చేశారు. పిల్లలతో బృందావనాన్ని తయారుచేయించి ఆటలతో గడిపారు. పిల్లలకు కృష్ణుడి వేషం వేసి, చేతికి వీణలు అందించి నృత్యాలు చియించారు.

## శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ ఎన్వీ రమణ



**తిరుమల, ఆగస్టు 19 (సమ సమాజం):** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దర్శించారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి సుప్రభాతం, అభిషేక సేవలో పాల్గొన్నారు. సీజేఐతోపాటు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ కూడా శ్రీనివాసుని దర్శించు కున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌కు ఆలయ పండితులు వేదా శీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి శేశ వస్త్రాన్ని బహూకరించి, శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## హైదరాబాద్ లోని పలుప్రాంతాల్లో భారీ వర్షం

జిల్లాల్లోనూ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ



**హైదరాబాద్, ఆగస్టు 19 (సమ సమాజం):** హైదరాబాద్ లోని పలుప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, అమీర్‌పేట్, యూసుఫ్‌గూడా ప్రాంతాల్లో వర్షం పడింది. పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికుల అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ జామ్ తో పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు, రోడ్ల పక్కన తోపుడు బండ్ల వ్యాపారులు ఇళ్లకు వెళ్లే

3

## తెలంగాణ విద్యుత్ పథకంపై కేంద్రం కుట్రలు

24 గంటల కరెంట్ ఇవ్వకుండా దుర్మార్గాలు

తెలంగాణకుమంచిపేరు రావడంతో తట్టుకోలేని కేంద్రం

విద్యుత్కొనుగోళ్లపై ఆంక్షలు విధించడం దారుణం

విద్యుత్ కోతలు విధించాల్సి వస్తే కేంద్రానిదే బాధ్యత

డిస్కమ్‌లపై కర్ర పెత్తనం చేయడం హేయమైన చర్య

మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి జగదీశ్ రెడ్డి

3

## సంపాదకీయం

# వరదలతో ముప్పు గ్రామాల్లో నిత్య నరకం

వరద కష్టాల నుంచి ప్రజలు ఇంకా బయటపడలేదు. కానీ రాజకీయనాయకులు ఎప్పుడో బయటపడ్డారు. వాటి గురించి మరచిపోయారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో అంతా బాగుందన్న ధోరణిలో జెండా పండగలను ఘనంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఇంకా పడుతూనే ఉన్నారు. ఈ వానలు ఇప్పట్లో తగ్గే పరిస్థితి కానరావడం లేదు. వరదలు వచ్చిన ప్రతిసారీ రకరకాల వ్యాధులు వ్యాపించడం, ప్రభుత్వంతో పాటు, వివిధ సేవా సంస్థలు వైద్య శిబిరాలు నిర్వహించడం చూస్తున్నాం. దాదాపుగా ప్రతి ఏడాదీ ఇదే తరహా పరిస్థితి ఏర్పడుతున్నప్పటికీ ఎప్పటికప్పుడు ఆపద మొక్కులు తప్ప శాశ్వత పరిష్కారాన్ని చూపడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. దీంతో బాధిత ప్రజానీకం ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన స్థితి. ఏజెన్సీ ప్రాంతంలో ఈ దుస్థితి మరింత స్పష్టంగా కనపడుతోంది. ప్రతి ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంది. భారీ వరదలతో గోదావరి పరీవాహక ప్రాంతం నెలరోజులుగా అతలాకుతలమవుతోంది. ముంపు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా అస్తవ్యస్థ పరిస్థితులు కొనసాగుతున్నాయి. బురదతో అనేక ప్రాంతాలు నిండిపోయాయి. వరద నీరు నిలిచి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. రక్షిత మంచి నీటి పథకాలు పనిచేయడం లేదు. వీటికి తోడు మరోసారి ముంచుకొచ్చిన వరద ముంపు కారణంగా వ్యాధులు విజృంభించడానికి అవకాశం ఏర్పడింది. ఇక రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయి. గడిచిన వందేళ్లలో ఎన్నడూ లేని విధంగా గత నెలలో గోదావరికి వరద వచ్చిందని ప్రభుత్వమే ప్రకటించింది. ఫలితంగా గతంలో ఎన్నడూ వరద బారిన పడని ప్రాంతాలు కూడా ముంపులో చిక్కుకున్నాయి. అందుకే ఇటీవలి వర్షాల భయం ఇంకా తొలగి పోలేదు. ఇప్పటికే లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్న వర్షాల కారణంగా అన్నదాతలు ఆక్రందన చెందుతున్నారు. వర్షాలు వస్తే ఓ బాధ..రాకుంటే మరో బాధలా అన్నదాతల పరిస్థితి తయార య్యింది. వరి, పత్తి,వేరుశనగ, శనగ, పెసర, కంది పంటలు నీట మునిగాయి. సాగుతో సంబరపడ్డ రైతులకు కష్టాలు తప్పడంలేదు. భారీ వర్షాల కారణంగా అనేక జిల్లాల్లో పంటలు నీట మునిగాయి. ఈ వర్షాలు ఇంకా కురుస్తూనే ఉండడంతో పంటలు మురిగిపోతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. యాభై ఏళ్లలో ఇంతటి వర్షం రాలేదని కూడా అనుకుంటున్నారు. దీని వల్ల నష్టం అపారంగా ఉంటుందని అన్నారు. అయితే చెరువులు కుంటలు నిండడంతో దీర్ఘకాలికంగా ఉపయోగమే ఉంటుందని కూడా భావిస్తున్నారు. కరోనా, వర్షాకాలపు వ్యాధులు, వరదలు ఈ మూడింటిని ఏకకాలంలో ఎదుర్కొనేందుకు ఇప్పుడు ప్రభుత్వాలు సిద్దపడాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ గోదావరి ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నది. మునుపెన్నడూ లేనంత గా అనేక గ్రామాలు, పట్టణాలు మునిగాయి. చెరువులు,కుంటలు ఎలా ఆక్రమణలకు గురయ్యాయో ముంపు ఘటనలు కళ్లకు కట్టాయి. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరీతీర ప్రాంత గ్రామాలన్నీ ముంపునుంచి ఇంకా తేరుకో లేదు. లంక గ్రామాలు నీట మునిగాయి. ఈ తీవ్రవర్షాలు ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్నాయి. గోదావరి వరదలకు పంట మునిగి నష్టపోయిన అన్నదాతలు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుం టుందని వరద ప్రాంతాల్లో పర్యటించిన మంత్రులు, ఎమ్మెల్యేలు హామీ ఇస్తున్నారు. గోదావరి తీర గ్రామాల్లో వరదకు నీట మునిగిన వరి పొలాలు, పత్తి చేన్లు దర్శనమిస్తున్నాయి. వరద తాకిడికి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షానికిఅనేక చోట్ల ఇండ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులు తమను ఆదుకోవాలని, గోదావరి వరదకు తాకిడికి పెద్ద మొత్తంలో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. తమకు న్యాయం జరిగేలా చూడాని కోరారు. ఏజెన్సీలో వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం వివరాలు సేకరించడం జరుగుతుందని హామీ ఇస్తున్నారు. వరదలు వచ్చినప్పుడు శాశ్వత సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉన్నా పాలకులు ఎప్పుడూ తాత్కాలిక చర్యలతోనే సరిపుచ్చడంతో సమస్య నిరంతరంగా ఉంటోంది. సమస్యను శాశ్వతంగా పరిష్కరించే ఆలోచన చేయకుండా, ఏటేటా వరదలు వచ్చినప్పుడు సహాయకార్యక్రమాలను అమలు చేయడం మీదనే రాజకీయ పక్షాలు ఆసక్తి చూపుతున్నాయి. విపత్తులను ఎదుర్కొనడానికి శాశ్వత వ్యవస్థలు ఉండాలని, ఒక వ్యూహం అవసరమని గుర్తించడం లేదు. దేశంలో విపత్తు నివారణ చట్టాన్ని రూపొందించారు. విపత్తుల నిర్వహణా వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఇప్పటికీ పూర్తిస్థాయి యంత్రాంగం ఏర్పడలేదు. విపత్తుల నిర్వహణ అన్నది ప్రాణ, ఆస్తి నష్టాలను సాధ్య మైనంతగా తగ్గించడానికి జరిగే ప్రయత్నమే తప్ప, విపత్తుల సందర్భంగా శాశ్వత చర్యలకు అవకాశం ఏర్పడడం లేదు. నాలుగు దశాబ్దాల కిందటి దివిసీమ ఉప్పెన తరువాత, కోస్తా ప్రాంతంలో తుఫానుల నుంచి రక్షణకు ఏంచేయాలన్న ఆలోచన, కొన్ని ప్రయత్నాలు కూడా జరిగాయి. కానీ, ప్రతి ఏటా ఏదో ఒక స్థాయిలో వచ్చే వరదల గురించిన వ్యూహరచన మాత్రం జరగడం లేదు. వరదల తాకిడికి రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. వర్షం తగ్గగానే వాటిని మరమ్మతులు చేయిస్తామని అధికారుల చెబుతున్నారు. మరమ్మతుల విషయమై ఆర్అండ్‌బీ అధికారులతో మంత్రులు ఇప్పటికే చర్చించారు. ఇంకా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరుసపెట్టి కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకుతున్నాయి. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రోడ్లు దెబ్బతినడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. రెండు రాష్ట్రాల్లో సహాయక చర్యలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అయితే వారిని బురద నుంచి బయటపడేలా చేయాలి. శాశ్వత గహాలను కట్టించి ఇవ్వాలి. అప్పుడే సమస్యకు కొంతయినా పరిష్కారం దక్కగలదు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# మునుగోడు ముమ్మాటికీ రెఫరెండమే

రేపటి ఎన్నికలకు ఇది సెమీఫైనల్ ● సంచార జాతులను పట్టించుకోని కెసిఆర్ ● పాదయాత్రలో మండిపడ్డ బండి సంజయ్



**జనగామ, ఆగస్టు 19 (సమ సమాజం):** కేసీఆర్ కు ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే ఇతర పార్టీల నుంచి టీఆర్ఎస్ లో చేర్చుకున్న వారితో రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ సవాల్ విసిరారు. మునుగోడు ఉప ఎన్నిక వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు రెఫరెండంగా భావిస్తున్నామన్నారు. మునుగోడు ఉప ఎన్నిక అంటే సీఎం కేసీఆర్ భయపడుతున్నారని తెలిపారు. మునుగోడు ఉప ఉన్నిక బీజేపీ తెచ్చింది కాదని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఉప ఎన్నికలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈనెల 21 జరిగే బీజేపీ సభలో అమిత్ షా సమక్షంలో రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరతారన్నారు. టీఆర్ఎస్ సభకు మించి బీజేపీ సభ నిర్వహిస్తామని బండి సంజయ్ పేర్కొన్నారు. బండి పాదయాత్ర జిల్లాలో కొనసాగింది. ఈ సందర్భంగా గాజులు అమ్ముకునే మహిళలతో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంచార జాతులకు కేసీఆర్ తీవ్ర అన్యాయం చేస్తుండని సంజయ్ అన్నాడు. ఎంబీసీ కార్పొరేషన్‌కు ఏటా రూ. 1,000 కోట్లు కేటాయిస్తానని కేవలం రూ. 67 కోట్లు ఇచ్చాడని మండిపడ్డారు. జనగామ జిల్లా చీటకోడూరులో సంచార జాతులతో బండి సంజయ్ రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ అధికారంలోకి వచ్చాక సంచార జాతులను ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సంచార జాతులు తలుచుకుంటే రాజ్యం మారుతుందన్న బండి సంజయ్... సంచార జాతులన్నీ ఇంటింటికీ తిరిగి కేసీఆర్ సర్కార్ చేస్తున్న అన్యాయాన్ని వివరించాలని పిలుపునిచ్చారు. సంచార జాతుల బాధలు చూస్తే దు:ఖమొస్తుందని బండి సంజయ్ అన్నారు. ఏడాది కాలంగా తనది సంచార బతుకే అని చెప్పారు. సంచార జాతుల కష్టాలు ఎలా ఉంటాయో స్వయంగా చూస్తున్నానన్నాడు. బీసీల ద్రోహి కేసీఆర్ పాలనకు చరమ గీతం పాడతామన్నారు. కులవృత్తులను కేసీఆర్ నిర్వీర్యం చేశాడని మండిపడ్డారు. తెలంగాణకు ప్రధాని మోడీ రెండు లక్షల 40 వేల ఇళ్లు ఇస్తే..వాటిని కూడా కేసీఆర్ కట్టించడం లేదని చెప్పాడు.

# మునుగోడుపై సిపిఐ నిర్ణయాన్ని నేడు తెలియచేస్తాం: నారాయణ

**హైదరాబాద్, ఆగస్టు 19 (సమ సమాజం):** మునుగోడు తమకు బలమైన ప్రాంతమని సీపీఐ నేత నారాయణ అన్నారు. అక్కడ గతంలో ఐదుసార్లు గెలిచిన చరిత్ర ఉందన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ... మా ముందు మూడు ఆప్షన్స్ ఉన్నాయి. వీటిలో రేపు ఏదో ఒక నిర్ణయం తీసుకుంటాం అని చెప్పారు. ఎంత మంచోడైనా బీజేపీని ఓడగొట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటిదాకా రాజకీయపరమైన డెసిషన్ తీసుకోలేదన్నారు. రాష్ట్ర మహాసభల్లో సీపీఐ నాయకులు బిజీగా ఉన్నామని... అందుకే కాంగ్రెస్ నాయకులను కలవడం లేదని తెలిపారు. సీపీఐ పార్టీ బలోపేతానికి ఉపయోగపడే నిర్ణయం తీసుకుంటామన్నారు. విమర్శలతో తమకు సంబంధం లేదని...తాము ఎవరికి మద్దతు ఇవ్వాలనుకుంటున్నామో వాళ్లకే ఇస్తామని నారాయణ పేర్కొన్నారు.



# కాంగ్రెస్ నేతలు మీడియాకు ఎక్కకూడదు

అంతా మునుగోడు విజయం కోసం పాటుపడాలి
పార్టీ విషయాలపై అంతర్గతంగానే మాట్లాడితే మంచిది
రాజీవ్ జయంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్న సీతక్క



**ఆగస్టు 19 (సమ సమాజం):** బయట మాట్లాడకుండా.. లోపల కూర్చొని మాట్లాడుకోవాలని సీనియర్, జూనియర్ నేతలకు కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క సూచించారు. ఒక ప్రోగ్రాంకు పిలుపునిస్తే.. అందరూ హాజరు కావాల్సిందేనని.. ఇదోదే పేరంటం.. భోజనం కాదన్నారు. గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ నేతలు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. పార్టీకి రాజీనామా చేసి అధిష్టానంపై విమర్శలు గుప్పిస్తున్నారు. త్వరలో మునుగోడు ఉప ఎన్నిక వస్తున్న నేపథ్యంలో ఇలాంటి పరిణామాలు చోటు చేసుకుంటుంటడం కాంగ్రెస్ నేతల్లో కలవరం రేపుతోంది. మునుగోడులో శనివారం కాంగ్రెస్ పలు కార్యక్రమాలను నిర్వహించనుంది. అందులో భాగంగా ఎమ్మెల్యే సీతక్క మాట్లాడింది. కాంగ్రెస్ లో సంక్షోభం ఉన్నప్పుడు కలిసి పని చేయాలని... అధిష్టానం వద్ద మాట్లాడుకోవచ్చున్నారు. మోసం చేసి ఓ వ్యక్తి బయటకు పోయినప్పుడు.. ఇలాంటి టైంలో కొంతమంది నేతలు ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ విషయాలన్నీ క్యాడర్ తో పాటు ప్రజలు అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో పార్టీలో ఎన్నో సమస్యలు వచ్చినా.. పరిష్కరించుకుందన్నారు. మునుగోడులో కాంగ్రెస్ నిర్వహించే కార్యక్రమాలకు అందరూ వస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ కు కంచుకోట అన్నారు. గతంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు జరిగాయనే విషయాన్ని గుర్తు చేశారు. ఏడు మండలాలు, 175 గ్రామాల్లో రాజీవ్ జయంతి కార్యక్రమాలకు హస్తం పార్టీ నేతలు ప్లాన్ చేశారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ ర్యాలీలతో పాటు.. నడిబొడ్డున పార్టీ జెండా ఆవిష్కరించాలని నిర్ణయించారు. ప్రతి ఇంటికి పండ్ల బుట్ట పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి ఇంటికి మన మునుగోడు – మన కాంగ్రెస్ పేరుతో స్టిక్కర్లు, కరపత్రాలు అందజేయనున్నారు.

# పోడు పట్టాలు ఇచ్చాకనే ఇక్కడికి రావాలి

కెసిఆర్ బహిరంగ సభ నేపథ్యంలో
తండావాసుల ఆందోళన

**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 19 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ బహిరంగ సభ నేపథ్యంలో సంస్థాన్ నారాయణపురం రాచకొండ తండావాసులు ఆందోళనకు సిద్ధమయ్యారు. గిరిజనులకు పోడు భూములు ఇవ్వకుంటే పార్టీ నాయకులెవరినీ గ్రామాల్లోకి రానివ్వమని హెచ్చరించారు. ఈ విషయంపై కేసీఆర్ సభ సాక్షిగా హామీ ఇవ్వకుంటే అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. పోడు భూముల వ్యవహారంలో ప్రభుత్వం స్పందించకుంటే రైతులందరూ నామినేషన్ వేయాలని నిర్ణయించారు. రాచకొండ తండాల్లో ఎలాంటి వసతులు కల్పించకుండా అడవిని నమ్ముకుని బతుకుతున్నామని చెప్పారు. తమ భూమిని తమకు లేకుండా చేస్తే దేనికైనా సిద్ధమని వార్నింగ్ ఇచ్చారు. మునుగోడు నియోజకవర్గంలోని దాదాపు 30వేల గిరిజన ఓట్లు ఉన్నాయని స్పష్టం చేశారు.

# దేశాన్ని నిర్మించే పనిలో ఉన్నాం

ఇది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినంత ఈజీ కాదు
గోవాలో ఇంటింటికీ నీరు అందించే కార్యక్రమం
వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 19 (సమ సమాజం):** జల్ జీవన్ మిషన్ కింద మూడేండ్లల్లో 7 కోట్ల గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించామని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. శుక్రవారం ఆయన గోవాలో హర్ ఘర్ జల్ ఉత్సవ్ లో వర్చువల్ విధానంలో పాల్గొని మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చిన 70 ఏండ్లల్లో కేవలం 3 కోట్ల గ్రామాలకు మాత్రమే పైప్ లైన్ ద్వారా మంచినీళ్లు ఇచ్చారని మోడీ తెలిపారు. దేశం గురించి పట్టించుకోని వ్యక్తులు.. దేశ వర్తమానం, భవిష్యత్ గురించి కూడా పట్టించుకోరన్నారు. ఓ దేశాన్ని నిర్మించడం అంత ఈజీ కాదన్నారు. ఎక్కడైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదని, అయితే దేశాన్ని నిర్మించడానికి కఠోర శ్రమ తప్పనిసరి అని ప్రధాని మోడీ అన్నారు. తాము దేశ నిర్మాణ మార్గాన్ని ఎంచుకున్నామని చెప్పారు. అందుకే తాము ప్రస్తుత, భవిష్యత్తు సమస్యలను, సవాళ్ళను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మోడీ తెలిపారు. కాగా, గోవాలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే అన్ని కుటుంబాలకు ఇంటింటికీ మంచి నీటిని అందజేయాలన్న లక్ష్యం సాకారమైనందుకు రాష్ట్ర ప్రభుత్వం హర్ ఘర్ జల్ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. దేశం గురించి పట్టించుకోనివారు, ఆ దేశం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ సందర్భంగా చెప్పారు. గడచిన ఎనిమిదేళ్ళలో ఎన్డీయే ప్రభుత్వం చేసిన కృషిని వివరించారు. జల జీవన్ మిషన్ క్రింద గత మూడేళ్ళలో తన ప్రభుత్వం దాదాపు ఏడు కోట్ల గ్రామీణ కుటుంబాలకు కొళాయి నీటిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు, నీటి కనెక్షన్లను ఇచ్చిందని చెప్పారు. గ్రామాల్లో ఈ పథకం క్రింద ఇప్పటి వరకు 10 కోట్ల కనెక్షన్లను ఇచ్చినట్లు చెప్పారు. దేశ నిర్మాణానికి శ్రమించడం తప్పనిసరి అన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి పెద్దగా శ్రమపడవలసిన అవసరం లేదని, అయితే దేశాన్ని నిర్మించడానికి కఠోర శ్రమ తప్పనిసరి అని తెలిపారు. తాము దేశ నిర్మాణ మార్గాన్ని ఎంచుకున్నామని చెప్పారు. అందుకే తాము ప్రస్తుత, భవిష్యత్తు సమస్యలను, సవాళ్ళను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. దేశం గురించి పట్టించుకోనివారు దేశం ఎదుర్కొంటున్న, ఎదుర్కొనబోతున్న సవాళ్ళను కూడా పట్టించుకోరని తెలిపారు. అలాంటివారు నీటి గురించి పెద్ద పెద్ద మాటలు చెబుతారని, ఆ మాటలను అమలు చేసేందుకు గొప్ప దార్శనికతతో పనిచేయరని అన్నారు. గోవాలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే అన్ని కుటుంబాలకు నూటికి నూరు శాతం కుటుంబాలకు కొళాయి నీటిని అందజేయాలన్న లక్ష్యం సాకారమైనందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. వీడియో లింక్ ద్వారా మోదీ మాట్లాడారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, కేంద్ర జల శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ పనజీలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

# సర్కార్ బడుల్లో మిధ్యగా మధ్యాహ్న భోజనం

మెస్ ఛార్జీలు చెల్లించకపోవడంతో నిర్వాహకుల బంద్



**వరంగల్, ఆగస్టు 19 (సమ సమాజం):** రాష్ట్రవ్యాప్తంగా సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజనం నిలిచి పోతుండడంతో విద్యార్థులు అవస్థలు పడ్తున్నారు. స్కూళ్లలో వంట చేసే ఏజెన్సీలకు ఏళ్ల తరబడి మెస్ చార్జీలు పెంచకపోవడం, 4, 5 నెలలుగా బిల్లులు ఇవ్వకపోవడంతో నిర్వాహకులు పనుల నుండి తప్పుకుంటున్నారు. వంట బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగిస్తున్నా, పైసల్లేక వాళ్లు కూడా చేతులెత్తేస్తున్నారు. కొన్ని చోట్ల బిల్లుల కోసం నిర్వాహకులు ఆందోళన కూడా చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో టీచర్లే వంటలు చేస్తుండగా, వీలు కాని ప్రాంతాల్లో విద్యార్థులే ఇండ్ల నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా 26 వేలకు పైగా గవర్నమెంట్ స్కూళ్లలో 21 లక్షల మందికి పైగా చదువుతున్నారు. డ్రాపౌట్లను తగ్గించేందుకు అన్ని ప్రైమరీ, హైస్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి 4 రూపాయల 97 పైసల చొప్పున, హైస్కూళ్లలో 7 రూపాయల 45 పైసల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు తగ్గట్టు మీల్స్ రేట్లు పెంచాలని వంట ఏజెన్సీలు కోరుతున్నాయి. కానీ ప్రభుత్వం ఈ డిమాండ్ ను పట్టించుకోవడం లేదు. అంతేకాదు కొన్ని నెలలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదు. కొన్ని జిల్లాల్లో గత అకాడమిక్ ఇయర్ జనవరి, ఫిబ్రవరితో పాటు.. ఈ ఏడాది మే, జూన్, జూలై నెలల బిల్లులు కూడా ఇవ్వలేదు, ఇంకొన్ని జిల్లాల్లో గత 3 నెలల బిల్లులు చెల్లించలేదు ప్రభుత్వం. అయితే కొన్ని జిల్లాల్లో వంట బాధ్యతలను డ్వాక్రా సంఘాలకు అప్పగించారు. మరికొన్ని జిల్లాల్లో అక్షయపాత్ర అనే స్వచ్ఛంధ సంస్థకు ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం నాయకపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 17 రోజులుగా వంట బంద్ అయింది. స్కూల్ హెడ్ మాస్టర్ చొరవ తీసుకొని కొన్ని రోజుల పాటు వేరే వారితో వంట చేయించి స్టూడెంట్స్ కు భోజనం పెట్టారు. అయినా విద్యార్థులు తమ ఇళ్ల నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకొని తింటున్నామన్నారు.

# కాటెడాన్‌లో లారీ బీభత్సం

బ్రేకలు ఫెయిల్ కావడంతో లారీకి ఢీ
ప్రమాదంలో పలువురికి గాయాలు




**రంగారెడ్డి, ఆగస్టు 19 (సమ సమాజం):** రాజేంద్రనగర్ కాటేదాన్ రవి ఫుడ్స్ వద్ద కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా బ్రేకులు ఫెయిల్ కావడంతో జనాల మీదకు దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారందరినీ దగ్గరలోని హాస్పిటల్‌కు తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాటేదాన్ లోని రవి ఫుడ్స్ యూనిట్ 2 లోపల కంటైనర్ ను డ్రైవర్ పార్క్ చేయడం బ్రేకులు ఫెయిలవడంతో బయటకు దూసుకొచ్చింది. అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. కంటైనర్, బస్సు మధ్య నలిగి బస్సులో ప్రయాణిస్తున్న జ్ఞానేశ్వర్ అనే డ్రైవర్ కుడి చేయి నుజ్జునుజ్జ యింది. అతనితో పాటు మరో మహిళకు తీవ్రంగా గాయాలైనట్లు తెలుస్తోంది. భారీ కంటైనర్ స్పీడ్ గా వెనక్కి రావడంతో జనం భయంతో తమ వాహనాలు వదిలి దూరంగా పారిపోయారు. ఘటన అనంతరం కంటైనర్ డ్రైవర్ దాన్ని అక్కడే వదిలి పారిపోయాడు. ఘటనాస్థలానికి చేరుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థుల సర్టిఫికెట్లను ఆపొద్దు

కాలేజీలకు ఇంటర్ బోర్డు హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 19 (సమ సమాజం):** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కాలేజీలకు ఇంటర్మీడియట్ బోర్డు కీలక ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల సర్టిఫికెట్లు ఆపవద్దని కాలేజీలను ఇంటర్ బోర్డు ఆదేశించింది. నారాయణ కాలేజీ ఘటన నేపథ్యంలో ఇంటర్ బోర్డు ఈ ఆదేశాలను జారీ చేసింది. కోర్సు పూర్తయిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందేనని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఉమర్ జలీల్ స్పష్టం చేశారు. ఏ కారణంతోనూ విద్యార్థుల సర్టిఫికెట్లు ఆపొద్దని చెప్పారు. సర్టిఫికెట్లు ఇవ్వకపోతే డీఐఈవో లేదా ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రయివేటు కాలేజీలను తనిఖీలు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాలేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉమర్ జలీల్ హెచ్చరించారు.

# మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసేది ఫోటోనే : మెదక్ పద్మాదేవేందర్ రెడ్డి

**మెదక్, ఆగస్టు 19 (సమ సమాజం):** మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసేది ఒక్క ఫోటో మాత్రమేనని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మెదక్ జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మెదక్ పట్టణం ద్వారక గార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కెమెరాని కనుగొన్న లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫోటోలు తీయడం అద్భుత కళ అని అన్నారు.సమాజ అభివృద్ధిలో ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకమని కొనియాడారు. ప్రతి సన్నివేశాన్ని గుర్తుండిపోయేలాఫోటో గ్రాఫర్లు తీసిన ఫోటోలు భావితరాలకు మధురమైన స్మృతులుగా మిగిలిపోతున్నాయన్నారు. మనం ఏ కార్యక్రమం చేపట్టిన ఫోటోగ్రాఫర్ ఉండడం ఎంతో ముఖ్యంగా మారిపోయిందన్నారు. ఫోటోగ్రాఫర్ వృత్తి అనేది ఒక గొప్ప కళ అని కొనియాడారు. సమాజంలో ఫోటోగ్రాఫర్లకు మంచి గుర్తింపు ఉందన్నారు. ఫోటోగ్రాఫర్లు తీసే ఒక్క ఫోటో ప్రభుత్వాన్నే ఆలోచింపజేస్తుందన్నారు. ప్రస్తుత పోటీని తట్టుకుని నిలబడాలంటే నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ కోరిక మేరకు త్వరలోనే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎప్పుడు ఎలాంటి సమస్య వచ్చినా తననుసంప్రదించాలని సూచించారు.ఫోటో, విడియో గ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.అంతకుముందు పాత కెమెరాల ప్రదర్శన, అలాగే కొత్త కెమెరాల వినియోగం గురించి దృశ్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. వజ్రోత్సవాల్లో భాగంగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాల నుంచి వెల్కమ్ బోర్డు వరకు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. వెంకటేశ్వర్ రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, డైట్ ప్రిన్సిపల్ రమేష్ బాబు, తెరాస పట్టణ అధ్యక్షులు గంగాధర్, ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నర్సింలు, ఫోటో వీడియో గ్రాఫర్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఆప్కారీ శాఖ భవన ప్రారంభోత్సవానికి మోక్షం ఎప్పుడో.?

**ఆందోల్, ఆగస్టు 19 (సమ సమాజం):** జోగిపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ క్రీడ మైదాన ప్రాంగణ ఆవరణలో ఆప్కారీ నూతన భవనాన్ని నిర్మించారు. కానీ ప్రారంభోత్సవాన్ని మార్చారు కారణాలేంటో వారికే తెలియాలి. లక్షలు వెచ్చించారు అంతా సిద్ధం చేశారు. హడావిడిగా రంగులు వేశారు. కొన్ని రోజుల్లో సంబంధిత శాఖ మంత్రి తో పాటు ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు ప్రారంభోత్సవం చేయనున్నట్లు సైతం వార్తలు వినిపించాయి. కానీ ఆ మాటలు కాస్త నెలలు గడిచిపోయిన ఆ అబ్కారి శాఖ నూతన ప్రారంభోత్సవానికి నోచుకోక పోవడం పట్ల మైదానంలో వాక్ ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులకు తోడు కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో, పాలకుల నిర్లక్ష్యమో కానీ. నేడు ఆ వాక్ ట్రాక్ పూర్తిగా మురికి కాలువగా దర్శనమిస్తూ వృధాగా పోతున్న ఆ మురికి నీరు ఈ భవన ఆవరణలోకి వెళ్తూ బురదమయంతోచిత్తడిగా తయారయింది. దీనికి తోడు పందులు స్వైర విహారం చేయడం పట్ల ఈ మైదానంలోకి వచ్చే వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది జోగిపేట ఆప్కారి శాఖ నూతన భవనం పరిస్థితి. భవనం నిర్మాణం పూర్తయి కొన్ని నెలలు గడుస్తున్నా కరెంటు మీటర్ మాత్రం గిర్రు మంటుంది. కరెంటు బిల్లులు తాళం వేసిన భవన ముఖద్వారానికి పెట్టి వెళ్తున్న పరిస్థితి మనకు దర్శనమిస్తోంది. ఇదే అంశంపై ఆప్కారి శాఖ అధికారులకు వివరణ కొరకు ఫోన్ చేస్తే అందుబాటులోకి రాకపోవడం శోచనీయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శ్రద్ధ చూపి భవన ప్రారంభోత్సవానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

# సేవ చేయాలనే తపన ప్రతి ఒక్కరు లో ఉండాలి

**కే సుభాష్**

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 19 (సమ సమాజం):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మాతాపితరుల సేవాసదన్ లో ప్రణయ్ కుమార్ అనే బాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ప్రణయ్ కుమార్ తండ్రి మాట్లాడుతూ, చిన్నతనం నుండే పిల్లలకు సహాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని ఉద్దేశంతో ఎంతో కొంత పేదలకు సహాయం చేయాలని పుట్టినరోజు వేడుకలు మాతాపితరుల సేవాసదన్ లో వారికి అల్పాహారంగా అరటి పండ్లను అందించి నిర్వహించినట్లు తెలిపారు. ఎంతోమంది యువకులువిందులు వినోదాలకు అవకాశం ఇవ్వకుండా ఎంతోమంది పేదవారు ఉన్నారు కాబట్టి వారికి ఎంతో కొంత సహాయం చేసిన వారు అయితే వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ మనకు మంచి చేస్తాయని ప్రతి ఒక్క యువకులు ఇలాంటి సేవాసదన్ లో జరుపుకోవాలని వారికి తోడ్పాటును అందించాలని యువతకు తెలియజేశారు. ప్రతి ఒక్క పుట్టినరోజు వేడుక ఇలాంటి సేవ సదన్లో నిర్వహిస్తారని వారి ఆశీస్సులు తీసుకోవడం లో ఉన్న తృప్తి మరి ఎక్కడా దొరకదని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు రామచంద్రారెడ్డి ఆశ్రమం వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# పోస్ట్ కార్డు నిరసన చేపట్టి తాసిల్దార్ కి వినతి పత్రం ఇచ్చిన మలిదశ ఉద్యమకారులు

**అల్లాదుర్గం: ఆగస్టు 19 (సమ సమాజం):** అల్లాదుర్గం మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ను ఆదుకోవాలని ఒక ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 10,000 కోట్ల రూపాయల ప్ర %బఅ%త్యేక నిధి కేటాయించి ఉద్యమకారులకు ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం సుమారు 20 లక్షల రూపాయల ఆర్థిక సాయం 300 గజాల ఇంటి స్థలము కేటాయించి ఆదుకోవాలని చెప్పి పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు గతంలో కెసిఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ ఉద్యమం సమయం లో అల్లాదుర్గం మండలం నుండి ధర్నాలు రాస్తారోకోలు రైలు రోకోలు మిలియన్ మార్చ్ లాంటి అనేక ఉద్యమాలలో పాల్గొని ఉద్యమకారులపై పోలీసుల వేధింపులు కేసులు పెట్టి ఎన్నో ఇబ్బందులు పడి ఉద్యమకారుల యొక్క కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడ్డాయి ఇప్పటికీ కొన్ని కేసులు కొట్టివేయబడలేవు బహుశా ముఖ్యమంత్రి గారు ఉద్యమకారులు మరిచిపోయి ఉంటారేమో ఇప్పటికైనా మమ్మల్ని గుర్తు తెచ్చుకొని గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ చంద్రశేఖర రావు గారు వెంటనే మా యొక్క ఉద్యమకారుల యొక్క ఆవేదన బాధను అర్థం చేసుకొని మాకు న్యాయం చేయాలని వారు కోరారు అనంతరం అల్లాదుర్గం తాసిల్దార్ గారికి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు కే.బ్రహ్మం,మోహన్ రాథోడ్, మదర్, కాల రాములు, నక్క దుర్గయ్యా,తులసి దాస్, గోపాల్, మచ్చేందర్, ఆసిఫ్, కిషోర్, అశోక్, సుధాకర్, మహేశ్వర్ తదితర నిజమైన ఉద్యమకారులు పాల్గొన్నారు

# పతి ఒక్కరూ బోనాల పండుగలలో పాల్గొనాలి

**రంగారెడ్డి జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి**

**కడ్తాల, ఆగస్టు 19 (సమ సమాజం):** మూడు రోజుల పాటు జరిగే బోనాల పండుగకు ఎంపీటీసీ కి ఆహ్వానం రంగారెడ్డి జిల్లా కడ్తాల గ్రామంలో నిర్వహించే బోనాల పండుగకు ఎంపీటీసీల రంగారెడ్డి జిల్లా ఫోరం అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి కి ఆహ్వాన పత్రం అందజేశారు. 20 తారీకు మొదలుకొని మూడు రోజులపాటు జరగబోయే పోచమ్మ దేవాలయ కమిటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం కాటమయ్య బోనాలు, ఆదివారం రోజు పెద్దమ్మ మైసమ్మ, మదేల్ స్వామి, ఈదమ్మ దేవతల, సోమవారం పోచమ్మ దేవతలకు అదేవిధంగా సాయంత్రం అమ్మవారి వేషధారణ ఫలహారం బండి శివసత్తుల ఘటం మాత బోనం నిర్వహిస్తున్నట్లు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ మాత్యులు సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ పోతుగడ్డ రాములు, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ బీసీ కమిషన్ ఆచారి, మాజీ ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీ చంద్

# హైదరాబాద్ లోని పలుప్రాంతాల్లో భారీ వర్షం

(మొదటి పేజి తరువాయి) క్రమంలో ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలతో రాగల రెండు మూడు గంటల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమరం భీం,నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి,మెదక్ , వికారాబాద్ ,రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సిద్దిపేట, జనగాం, సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం ,మహబూబాబాద్, వరంగల్ ,కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి ,జయశంకర్ భూపాలపల్లి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, వనపర్తి జిల్లాల్లోని పలు ఏరియాల్లో తేలిక పాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

# మునుగోడులో సభల సందడి

(మొదటి పేజి తరువాయి) బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించింది. మునుగోడులో ఈనెల 20న సీఎం కేసీఆర్, 21న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగ సభలు ఉన్నాయి. సీఎం సభ రోజే ప్రతీ గ్రామంలో ఒక కాంగ్రెస్ దిగ్గజంతో పాదయాత్ర నిర్వహించాలని పీసీసీ నిర్ణయంతో నియోజకవర్గంలో హడావిడి నెలకొంది. మరోవైపు ప్రజాప్రతినిధుల కొనుగోళ్లు, సభలకు జనాల తరలింపునకు పెద్ద సంఖ్యలో ఆర్థిక లావాదేవీలు జరుగుతుండడంతో మునుగోడు వేడి సర్వత్రా కనిపిస్తోంది. ఏ గ్రామంలో చూసినా ఖరీదైన కార్లు, నేతల హడావిడి, సభలు, సమావేశాలతో సందడి వాతావరణం నెలకొంది. మునుగోడును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మంత్రి జగదీష్‌రెడ్డి ఎమ్మెల్యేలందరినీ నియోజకవర్గంలో మోహరించారు. ప్రతీ మండలానికి ఇద్దరు నేతలు గ్రామాలు పంచుకుని సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు మునుగోడులో సభాస్థలి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. శనివారం జరిగే సీఎం కేసీఆర్ సభ రోజే భారీగా చేరికలు చూపాలని నిర్ణయించినా, సమాచారం లీక్ అవుతూ ఎదుటి పార్టీ నుంచి అడ్డంకులు ఎదురయ్యే అవకాశం ఉండడంతో అర్ధరాత్రి అనేది కూడా లేకుండా ఎక్కడ ఉంటే అక్కడ ఫిరాయింపుదారులకు పార్టీ కండువా కప్పుతున్నారు. చేరికలకు తెరలేపిన బీజేపీకాంగ్రెస్ ప్రజాప్రతినిధులందరితో టచ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను అమిత్‌షా సభ రోజు భారీగా చేర్చుకునేందుకు వ్యూహం సిద్ధం చేశారు. అధికార పార్టీలో అసమ్మతితో రగిలిపోతున్న నేతలను తన టచ్‌లో ఉంచుకున్నారు. పార్టీ అభ్యర్థిగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఖరారవుతారన్న సమాచారంతో అసంతృప్త నేతలు ఓ వైపు రాజగోపాల్‌రెడ్డి, మరోవైపు బీజేపీ నేతలకు టచ్‌లోకి వెళ్తున్నారు. ఆ వలసలను ఆపే క్రమంలో అధికార టీఆర్‌ఎస్ కేసులు, అరెస్టుల వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. దీంతో అప్రమత్తమైన అసంతృప్త నేతలు అమిత్‌షా సభ వరకు వేచి చూడకుండా కమలం కండువా కప్పుకుంటున్నారు. చండూరు మండలానికి చెందిన ఐదుగురు టీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు బుధవారం చేరికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ చేతుల మీదుగా కండువాలు కప్పుకున్నారు. వీరు పార్టీని వీడుతున్నారన్న సమాచారం మంత్రికి తెలియడంతో ఆపేందుకు ప్రయత్నాలు ప్రారంభం కావడంతో, ఆ ఐదుగుకు హుటాహుటిన కమలం గూటికి చేరిపోయారు. అమిత్‌షా సభ రోజు భారీగా చేరికలను చూపించి రాజగోపాల్‌రెడ్డి తన ఇమేజ్‌ను చాటుకునే ప్రయత్నంలో ఉన్నారు. మునుగోడులో ఈనెల 20న సీఎం కేసీఆర్ సభ ఉండగా, అదేరోజు రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా 175 మంది కాంగ్రెస్ దిగ్గజాలు నియోజకవర్గానికి రానున్నారు. సీనియర్ నేతలు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, షబ్బీర్‌అలీ వంటి నేతలు ఒక్కో గ్రామానికి ఒకరు చొప్పున చేరుకుని కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించనున్నారు.

# నేడు మునుగోడుకు పిసిసి చీఫ్ రేవంత్

(మొదటి పేజి తరువాయి) రూపొందించామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్థానికంగా సమావేశాలు నిర్వహిస్తు న్నట్టు తెలిపారు. త్వరలో ఉప ఎన్నిక జరగనున్న నల్గొండ జిల్లా మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచార భేరిని మోగించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేసింది. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని గ్రామగ్రామానికి ఇంచార్జీలను నియమించింది. కాంగ్రెస్ ఇంచార్జీల ఆధ్వర్యంలో రేపు గ్రామగ్రామాన రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాలు జరుగుతాయని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్ ప్రకటించారు. రాజీవ్ జయంతి సందర్భంగా మోగించనున్న ప్రచార భేరి కార్యక్రమం కోసం మునుగోడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ మంత్రుల స్థాయి నేతలు తరలివెళ్లనున్నారు. భారతరత్న రాజీవ్ గాంధి జయంతి వేడుకలను మునుగోడు నియోజకవర్గంలోని ఊరూరా నిర్వహించనున్నారు. సీఎం సభ రోజు ఇబ్బందే అని తొలుత అనుకున్నా, ఢీ అంటే ఢీ అనే రీతిలో ఉండాలంటే అదే రోజు కార్యక్రమం ఏర్పాటు చేసుకోవాలని, పార్టీ క్యాడర్ ఎంత మంది కలిసివస్తారో తెలిసిపోతుందని నాయకులు నిర్ణయించినట్లు తెలిసింది. పీసీసీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించగా, జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ పాల్గొని 20న కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మునుగోడు నియోజకవర్గ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణికం ఠాకూర్ పిలుపు నిచ్చారు.మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు సర్వశక్తులు ఒడ్డాలని సూచించారు. మునుగోడు అసెంబ్లీకి ఉప ఎన్నికలపై స్పష్టత వచ్చిన వెంటనే పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్ రాష్ట్ర నేతలందరితో పలుమారు సమీక్షించిన విషయం తెలిసిందే. ఉప ఎన్నికకు పార్టీ కేడర్ ను సమాయాత్తం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. నేడు రాజీవ్ గాంధీ జయంతి నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేలా కార్యక్రమాలు నిర్వహించేందుకు వ్యూహరచన చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సైతం నేడు మునుగోడు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మన మునుగోడు – మన కాంగ్రెస్..హస్తం గుర్తుకే మన ఓటు అనే నినాదంతో రూపొందించిన లోగోను పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఒక వైపు సోనియాగాంధీ, మరోవైపు రాహుల్ గాంధీ ఫోటోలతో రూపొందించిన లోగోను మునుగోడు నియోజకవర్గంలో ప్రతి ఇంటిపై ఉండేలా చూడాలని రేవంత్ పిలుపునిచ్చారు. ఒకవైపు సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభతో ప్రచారాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కూడా ఢీ అంటే ఢీ అనేలా మునుగోడు నియోజకవర్గంలో దూసుకెళ్లేందుకు వ్యూహరచన చేశారు. శనివారం మునుగోడు నియోజకవర్గంలో జరగనున్న బీజేపీ, టీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల పోటాపోటీ కార్యక్రమాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

## తెలంగాణ విద్యుత్ పథకంపై కేంద్రం కుట్రలు

**నల్లగొండ, ఆగస్టు 19 (సమ సమాజం):** రాష్ట్రంపై కేంద్రం చర్యలు దుర్మార్గంగా ఉన్నాయని విద్యుత్ శాఖామంత్రి జగదీష్‌రెడ్డి ధ్వజమెత్తారు. విద్యుత్ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం ఏమిటని జగదీష్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. విద్యుత్ రంగం ఉమ్మడి జాబితాలోనిదని అయితే విద్యుత్ సంస్థలపై నిర్ణయం తీసుకునే అధికారం కేవలం రాష్ట్ర ప్రభుత్వలోనిదేనని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాల అభివృద్ధిని అడ్డుకోవడం దేశద్రోహం లాంటిదేనని చెప్పారు. విద్యుత్ కొనుగోళ్లలో ఒక్క రూపాయి బిల్లు కూడా పెండింగ్ లేదని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిని కేంద్రం అడ్డుకోవాలని చూస్తోందని, పాలనలో కేంద్రం ఫెయిల్ అయిందని, సీఎం కేసీఆర్ పాస్ అవుతున్నారనే బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీజేపీ కుట్రలను ప్రజల్లో ఎండగడతామని జగదీష్‌రెడ్డి తెలిపారు. బహిరంగ ఈ మేరకు మునుగోడు నియోజకవర్గ పరిధిలోని చండూరు పురపాలక సంఘం పరిధిలో విద్యుత్ కొనుగోలు, అమ్మకాలపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కోర్టు నుండి స్పష్టమైన ఆదేశాలు పొందిందని, అయినా కోర్టు తీర్పును ఉల్లంఘించి కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన విరుచుకుపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని చీకట్లోకి నెట్టేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకుని బీజేపీ ఈ తరహా కుట్రలకు తెరలేపిందని ఆయన ఆరోపించారు. తద్వారా తెలంగాణ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన, దళిత, గిరిజనులకు అందించే సబ్సిడీలు ఎత్తి వేయాలన్నదే బీజేపీ ఎజెండా అని ఆయన విమర్శించారు. విద్యుత్ కొనుగోళ్ల అమ్మకాలు ఆయన విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను కప్పిపుచ్చి బకాయిల పేరుతో హక్కులను హరించేందుకే ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కేంద్రం చెప్పినట్లుగా తెలంగాణ ప్రభుత్వం ఒక్క రూపాయి కుడా బకాయి పడలేదని మంత్రి జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు. అంతే కాకుండా ఇది పూర్తిగా డిస్కంలకు సప్లై దారులకు మధ్య కుదిరే ఒప్పందం మాత్రమేనని ఆయన తెలిపారు. వారిద్దరి మధ్య తగవులు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల నుండే విద్యుత్ సరఫరాను మెరుగు పరచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని అన్నారు. అనతి కాలంలోనే వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కిందన్నారు. జాతీయ స్థాయిలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంచి పేరు రావడం ఇష్టం లేకనే రాజకీయ ప్రేరేపిత నిర్ణయం తీసుకుందన్నారు. యావత్ భారత దేశంలో 24 గంటల విద్యుత్ సరఫరా చేసే రాష్ట్రంగా తెలంగాణ ఖ్యాతి గడించినందునే కేంద్ర ప్రభుత్వం ఉండడడంతో విసిగిపోయిన ప్రజలు ఎక్కడ తిరుగుబాటు చేస్తారోనన్న అనుమానంతోటే ఇటువంటి దుశ్చర్యలకు కేంద్రం పారిశ్రామిక వేత్తల చూపు తెలంగాణ వైపు మళ్లడం కుడా కేంద్ర ప్రభుత్వ దుగ్ధకు ఒక కారణంగా కనిపిస్తుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ అనాలోచిత చర్యతో రాష్ట్ర ప్రజల అభివృద్ధి కుంటు పడే ప్రమాదం ఉందని, అది అక్కడితో ఆగకుండా దేశాభివృద్ధికి నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి దేశద్రోహ పూరితమైన నిర్ణయం తీసుకున్న బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై న్యాయపరంగా పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# బిజెపి సభకు అడ్డంకులు సృష్టించే యత్నం



- కాళేశ్వరంలో అవినీతి జరగకుంటే ఎందుకు అడ్డుకుంటారు
- టిఆర్ఎస్ అవినీతికి పోలీసులు రక్షణ కవచం
- పోలీసులు, డబ్బుతో మునుగోడులో గెలవాలన్న పన్నాగం
- కెసిఆర్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్

**హైదరాబాద్, ఆగస్టు 19 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ వైఖరిపై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఫైర్ అయ్యారు. కాళ్లల్లో కట్టె పెట్టే విధంగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ సభకు అడ్డంకులు సృష్టించేందుకే ఆగమేఘాల మీద మునుగోడులో సీఎం సభ ఏర్పాటు చేశారని విమర్శించారు. టీఆర్ఎస్ సర్కారు ఎన్ని ప్రయత్నాలు చేసినా, కేసీఆర్ పార్టీని ఓడించాలని మునుగోడు ప్రజలు నిర్ణయించుకున్నారని ఈటల స్పష్టం చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి జిల్లా పరిషత్ ఛైర్మన్ల వరకు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఈటల రాజేందర్ చెప్పారు. అవినీతి జరగకుంటే కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనకు వెళ్లే ఇతర పార్టీల ఎమ్మెల్యేలను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. పోలీసులు, డబ్బును నమ్ముకుని మునుగోడు ఉప ఎన్నికలో గెలవాలని కేసీఆర్ ప్రయత్నిస్తున్నాడని ఈటల విమర్శించారు. ఇందులో భాగంగానే వేల కోట్ల రూపాయలను మునుగోడులో డంప్ చేశారని చెప్పారు. టీఆర్ఎస్ ఎంత భయపెట్టినా స్థానిక నేతలు కట్టలు తెంచుకుని కాషాయ కండువా కప్పుకుంటారని చెప్పారు. టీఆర్ఎస్ నేతల అక్రమాలకు పోలీసు అధికారులు సహకరిస్తున్నారని ఈటల ఆరోపించారు. వారి అన్యాయాల లెక్క అప్పజెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యతపై ఇంజనీర్లతో కమిటీ వేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం దగ్గర సరైన ప్లాన్ లేనందునే రాష్ట్రంలో కరెంట్ సమస్యలు తలెత్తుతున్నాయని అభిప్రాయపడ్డారు. పాలన విషయంలో సీఎం కేసీఆర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. సర్పంచులు, ఎంపీటీసీలను గ్రామాభివృద్ధికి దూరంగా ఉంచుతున్నారని మండిపడ్డారు. ఘట్‌కేసర్‌లో ఆయన సమక్షంలో రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షుడు, మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి 200 మంది అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. రాష్ట్రంలో అవినీతి, కుటుంబపాలనను అంతం చేసేందుకు చాలా మంది బీజేపీలో చేరుతున్నారని ఈటల రాజేందర్ తెలిపారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతున్నాయని మండిపడ్డారు. రుణమాఫీ చేయకుండా రైతులను, పీఆర్సీ, డీఏలు ఇవ్వకుండా ఉద్యోగులను కేసీఆర్ మోసం చేశారని ఈటల విమర్శించారు.

# ఏనిమిదేండ్లలో తెలంగాణ అద్భుతమైన ప్రగతి

(మొదటి పేజి తరువాయి) ఉందన్నారు. వ్యవసాయ రంగం, ఐటీ, పారిశ్రామిక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పాం సాగవుతున్నదని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల, సంక్షేమ పథకాలకు పెద్దఎత్తున నిధులు కేటాయిందన్నారు. ఫార్మస్యూటికల్ హబ్, బయోసైన్స్ హబ్‌గా ఉందని చెప్పారు. ఏరోస్పేస్ రంగంలో అద్భుతమైన ప్రగతి సాధించిందని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ఉపయోగించే హెలికాప్టర్ విడిభాగాలు ఇక్కడే తయారవుతాయని వెల్లడించారు. 15వందలకుపైగా మల్టీనేషన్ కంపెనీలు హైదరాబాద్ లో కొలువుదీరాయని మంత్రి కేటీఆర్ చెప్పారు. గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, మెటా లాంటి కంపెనీలు అమెరికా తర్వాత తమ సెకండ్ బ్రాంచిని హైదరాబాద్‌లో ప్రారంభించాయని వెల్లడించారు. ప్రపంచంలో భారత్ నంబర్ వన్‌లో ఉండాలంటే ఇన్నేవేషన్, ఇన్‌ఫ్రాస్టక్చర్, ఇన్‌క్లూజివ్‌నెస్ అనే మూడు సూత్రాలు పాటించాలన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్ నంబర్ వన్‌గా నిలవాలంటే ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్‌క్లూజివ్‌నెస్ అనే సూత్రాలు పాటించాలని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ ఉద్ఘాటించారు. ఇప్పటికే భారత్ ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన దేశంగా నిలిచిందని అన్నారు. ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంటే భారత్‌లోని రాష్ట్రాలన్ని తెలంగాణ వైపు చూస్తున్నాయని తెలిపారు. ఎనిమిదేళ్లలో తెలంగాణ గొప్ప ప్రగతిని సాధించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మార్గదర్శకంగా నిలిచిందని చెప్పారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో తలసరి ఆదాయం రెట్టింపు అయిందని చెప్పారు. ప్రపంచంలో భారత్ నంబర్ వన్‌లో ఉండాలంటే 3 సూత్రాలు పాటించాలన్నారు. కాళేశ్వరం నిర్మాణంతో వ్యవసాయంలో ప్రగతి సాధించాం. వ్యవసాయంలో 19 శాతానికిపైగా వృద్ధిరేటు ఉంది సాధించాం. మన పథకాలను ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. వారంతా బయటకు విమర్శలు చేసినా.. వారి రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న పథకాలను చూస్తేనే తెలుస్తోంది. అవి తెలంగాణ నుంచి స్ఫూర్తి తీసుకొని అమలు చేస్తున్న పథకాలు అని చెప్పుకొచ్చారు.

# నేడు మునుగోడులో సిఎం కెసిఆర్ సభ

(మొదటి పేజి తరువాయి)




కాన్వాయ్ నేరుగా వేదిక వద్దకు చేరుకునేలా ప్రత్యేక రూట్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు. ఇక సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్న ట్లు పార్టీ శ్రేణులు చెబుతు న్నాయి. సభకు విస్తృత ప్రచారం కల్పిస్తూ మండలాల వారీగా ఇన్‌చార్జిలు ఇప్పటికే క్షేత్రస్థాయి పర్యటనలతో బిజీగా ఉన్నారు. పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడంతోపాటు సామాన్య జనం సభకు వచ్చేలా ఏర్పాట్లు చేసారు. సభకు హాజరయ్యే జనానికి కూడా మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లను కూడాఅందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సభకు వచ్చే వాహనాలను సైతం ఎక్కడికక్కడే పార్క్ చేసే విధంగా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేసారు. మొత్తం 100 ఎకరాల్లో పది చోట్ల మునుగోడుకు మూడు వైపులా పార్కింగ్ స్థలాలను ఎంపిక చేశారు. ఎటు వైపు నుంచి వచ్చే వాహనాలు ఆ వైపే నిలిపి అక్కడి నుంచి ప్రజలకు సభాస్థలికి చేరుకునేలా చర్యలు చేపట్టారు. మంత్రి జగదీశ్‌రెడ్డి మునుగోడులోనే ఉండి సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభాస్థలిలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి జరుగుతున్న పనులను సమీక్షించారు. మునుగోడు అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని ఇక్కడి ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని, ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ మూడో స్థానంతో సరిపెట్టుకోక తప్పదన్నారు. మునుగోడు ప్రజా దీవెన సభ ద్వారా బీజేపీ దుర్మార్గాలతోపాటు మోదీ సర్కార్ అసమర్ధ పాలనను ఎండగట్టడమే లక్ష్యమని మంత్రి జగదీశ్‌రెడ్డి వివరించారు. ప్రజా దీవెన సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చేందుకు సిద్ధమవుతున్నారని, అందుకు అనుగుణంగా సభా ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.




# చలన చిత్రం






## బాలీవుడ్‌ను షేక్ చేస్తున్న తెలుగు హీరోలు

### బాహుబలితో మొదలై కొనసాగుతున్న చిత్రాల హవా

ప్రస్తుతం ఇండియా మొత్తం తెలుగు హీరోల హవా నడుస్తోంది. మన హీరోలు, సరిహద్దులు తెంచుకొని ఇండియా మొత్తం తిరుగుతున్నారు. ప్రస్తుతం కార్తికేయ 2 టీం వాళ్ల సినిమాని ప్రమోట్ చేస్తూ, ఇండియా మొత్తం తిరుగుతున్నారు. మరోవైపు విజయ్ దేవరకొండ , పూరి జగన్నాథ్, ఛార్మి లు కూడా లైగర్ సినిమా ప్రమోషన్స్ కోసం నార్త్ ఇండియా అంతా చాలా అగ్రెసివ్ గా తిరుగుతున్నారు. హిందీ సినిమానే తీసాము మీరు చూడండి అనే రేంజులో లైగర్ సినిమాని నార్త్ లో ప్రమోట్ చేస్తున్నారు. త్వరలో కళ్యాణ్ రామ్ కూడా బింబిసార సినిమాని హిందీలో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు. తెలుగులో డబుల్ బ్లాక్ బస్టర్ అయిన ఈ మూవీ హిందీ మార్కెట్ కూడా సొంతం చేసుకునేలా ప్రమోషన్స్ చేయడానికి నందమూరి హీరో ప్లాన్ చేస్తున్నాడు. అవసరం అయితే నార్త్ ప్రమోషన్స్ లో తమ్ముడు తారక్ ని కూడా రంగంలో దించడానికి కళ్యాణ్ రామ్ సిద్ధమవుతున్నాడు. నిజానికి ఈ ట్రెండ్ ని రాజమౌళి బాహుబలి సినిమాతో మొదలుపెట్టి, ఆర్ఆర్ఆర్ సినిమాతో పీక్ స్టేజ్ కి తీసుకోని వెళ్లాడు. ప్రభాస్, ఎన్టీఆర్ చరణ్ లు తెలుగు రాష్ట్రాల్లో కన్నా నార్త్ లోనే ఎక్కువ తిరిగి, అక్కడ మన సినిమాని ప్రమోట్ చేశారు. ఆ తర్వాత అల్లు అర్జున్ నార్త్ మార్కెట్ ని సొంతం చేసుకున్నాడు కానీ అక్కడ ప్రమోషన్స్ కోసం ప్రత్యేకంగా ఏమీ చేయలేదు. పుష్ప 2 విషయంలో ఆ లోటు కనిపించకుండా నార్త్ లో సుడిగాలి పర్యటనకి ఐకాన్ స్టార్ ప్రిపేర్ అవుతున్నాడు. సో ప్రభాస్ తో మొదలైన ఈ ట్రెండ్ ఇప్పుడు పీక్ స్టేజ్ కి వెళ్లి... స్టార్ హీరోల నుంచి యంగ్ హీరోల వరకూ ప్రతి ఒక్కరూ నార్త్ టు సౌత్ అన్ని ఏరియస్ కవర్ చేస్తూ ప్రొమోషన్స్ చేస్తున్నారు.

## ఓ సమయంలో సినిమాలను వదిలేయాలనుకున్నా

### 12 ఏళ్ల కెరీర్‌పై నటి అమలా పాల్ అంతరంగం

తమిళంలో నటిగా మంచి పేరును దక్కించుకున్న ముద్దుగుమ్మ అమలాపాల్ తెలుగులోనూ ఎంట్రీ ఇచ్చి అతి తక్కువ సమయంలోనే రామ్ చరణ్ మరియు అల్లు అర్జున్‌ల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంది. అయితే అనూహ్యంగా ఆమె కెరీర్ పెళ్లి,విడాకుల కారణంగా కొంత గందరగోళంలో పడింది. హీరోయిన్‌గా బిజీగా ఉన్న సమయంలో పెళ్లి చేసుకున్న ఆమె మళ్లీ టాలీవుడ్‌లో నిలదొక్కుకోలేక పోయింది. అయితే ఇతర భాషల్లో మాత్రం ఈ అమ్మడు బిజీగా వరుసగా సినిమాలు వెబ్‌సిరీస్‌లు చేస్తూ కెరీర్‌లో ముందుకు సాగుతోంది.నటిగా తనను తాను నిరూపించుకునేందుకు ఛాలెంజింగ్ పాత్రలు చేస్తూ ఉన్న అమలా పాల్ ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చి 12 ఏళ్లు అవుతుంది. ఈ సందర్భంగా ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. జీవితంలో ఒకానొక సమయంలో చాలా ఇబ్బంది పడ్డాను. ఆ సమయంలో నేను ఒక పాత్ర కోసం పరిగెడుతున్నట్లుగా అనిపించేది. పాత్రల కోసం సక్సెస్ కోసం వెంపర్లాడుతున్నట్లుగా అనిపించేది. వర్తమానంలో జీవించడం లేదని... అందరికి దూరంగా ఉంటున్నట్లుగా అనిపించేది. ఆ సమయంలో నాలో నేను చాలా మదన పడ్డాను. సినిమా పరిశ్రమల్రో ఎందుకు కొనసాగుతున్నానో అర్థం కాకపోయేది. అప్పుడే సినిమాలను వదిలేయాలి అనేంత డిప్రెషన్ కు వెళ్లి పోయాను. అప్పుడే నాన్న చనిపోయారు. అప్పుడు నన్ను చాలా భయాలు వెంటాడేవి. కాని నేను ఒక యోతధురాలిగా వాటన్నింటికి సమాధానం చెప్పకుంటూ ముందుకు వెళ్లాను. ప్రతి ఒక్కరికి కూడా సమాధానం అన్నట్లుగా నిలిచి నాకు నేను మళ్లీ విజయం వైపు తీసుకు వెళ్లాను. ఇప్పుడు నా జీవితం చాలా సంతోషంగా ఉంది.. నా పై నాకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపింది.



## పొన్నియిన్ సెల్వన్‌పై భారీ అంచనాలు

లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం రూపొందించిన పొన్నియిన్ సెల్వన్ చిత్రంపై ప్రేక్షకులలో భారీగా అంచనాలున్నాయి. ప్రేమకథా చిత్రాలకే మణిరత్నం టేకింగ్ గాని, డీటేయిలింగ్ గాని ఒక రేంజ్‌లో ఉంటుంది. అలాంటిది ఈ సారి ఏకంగా పీరియాడిక్ డ్రామా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడంటే ఇంకా ఏ స్థాయిలో తన టేకింగ్ ఉండనుందో అని ప్రేక్షకులు తీవ్ర ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన ప్రచార చిత్రాలు, టీజర్ ప్రేక్షకులలో భారీ అంచనాలను క్రియేట్ చేసాయి. పీరియాడికల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 30న విడుదల కానుంది. ఈ క్రమంలో మేకర్స్ వరుస అప్‌డేట్‌లను ఇస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని సెకండ్ సింగిల్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. పొన్నియిన్ సెల్వన్ చిత్రంలోని 'చోళ చోళ' అంటూ సాగే పాట విడుదల కానుంది. ఈ క్రమంలో మేకర్స్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇక ఇదివరకే చిత్రం నుండి విడుదలైన 'దొంగ దొంగ' పాటకు ప్రేక్షకుల నుండి విశేష స్పందన వచ్చింది. చియాన్ విక్రమ్, కార్తి, జయం రవి, ఐశ్వర్యరాయ్, త్రిష, బాబీ సింహా వంటి స్టార్లు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం రెండు పార్టులుగా తెరకెక్కనుంది. మొదటి భాగం సెప్టెంబర్ 30న తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థతో కలిసి మద్రాస్ టాకీస్ బ్యానర్‌పై మణిరత్నం స్వీయ నిర్మాణంలో తెరకెక్కించాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in